సాక్షి అనంతపురం

శుక్రవారం । 28 । జూలై । 2023



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 584 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కనులపండువగా బ్రహ్మోత్సవాలు

నార్పల మండలం గూగూడులో కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం 29.9°/20.7°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పాముకు చికిత్స!



చికిత్స అనంతరం పామును సంజీవరెడ్డికి అప్పగిస్తున్న పశువైద్యాధికారి గోవిందరాజులు

నార్పల: పామును చూస్తే చాలు ఎవరైనా ఆమడదూరం పరిగెడతారు. కానీ నార్పల మండల పశువైద్యాధికారి గురువారం ఓ పాముకు చికిత్స చేశారు. వివరాల్లోకి వెళ్తే... నార్పలకు చెందిన సంజీవరెడ్డి సుజలాన్ గాలి మరల కంపెనీ సబ్ స్టేషన్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో ఎక్కడ పాము కనిపించినా పట్టుకుని అటవీప్రాంతంలో వదిలిపెట్టేవాడు. ఈ క్రమంలోనే గురువారం నార్పలలోని ఆర్టీటీ కార్యాలయం వద్ద ఓ పాము సంచరిస్తుండటంతో స్థానికులు సంజీవరెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో అక్కడికి చేరుకున్న అతను పామును పట్టుకున్నాడు. కానీ అప్పటికే స్థానికులు దాన్ని గాయపరచడంతో తీవ్ర రక్తస్రావం అవుతోంది. దీంతో సంజీవరెడ్డి పామును మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకువెళ్లగా... పశువైద్యాధికారి గోవిందురాజు గాయపడిన పాముకు చికిత్స చేశారు. సాయంత్రం వేళ సంజీవరెడ్డి ఆ పామును అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు.

రీ-సర్వే వేగవంతం చేయండి

అనంతపురం అర్బన్: 'వైఎస్సార్-జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' పథకం కింద జిల్లాలో చేపట్టిన రీ-సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ-సర్వే అంశంపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ గాయత్రిదేవి పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో రెండో విడత కింద 57 గ్రామాల్లో రీ-సర్వే చేపట్టారన్నారు. 18 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌ఓఆర్ పూర్తయ్యిందన్నారు. మరో మూడు గ్రామాల్లో గ్రౌండ్ ట్రూ థింగ్ ఈ వారం పూర్తిచేయాలని ఆదేశించారు. నాలుగు గ్రామాల్లో 13 నోటిఫికేషన్ విడుదల చేశారని, మిగిలిన గ్రామాల్లోనూ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఆగస్టు 8లోగా నాలుగు గ్రామాల్లో ఫైనల్ ఆర్‌ఓఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీ రూప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా పెంచండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

యాడికి: రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలని ఎస్పీ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సీఐ కార్యాలయం వద్ద స్థలం కబ్జాకు గురి కాకుండా కంచె ఏర్పాటు చేయాలని సీఐ శంకర్ రెడ్డిని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాత పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన.. అక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేలా చూస్తామన్నారు. అనంతరం మండలంలో సమస్యాత్మక గ్రామమైన కోనుప్పలపాడును ఎస్పీ సందర్శించారు. మొహర్రం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగయ్య, ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయమని డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో డివిజనల్ రైల్వే వినియోగదారుల కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో సమస్యలు, సౌకర్యాలపై చర్చించారు. పలువురు డీఆర్‌యూసీసీ సభ్యులు మాట్లాడుతూ పలుచోట్ల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేశారని, తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన నగరాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపాలని కోరారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఆర్‌యూబీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం డివిజన్‌లోని 17 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఏడీఆర్‌ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఈఎన్ అక్కిరెడ్డి, సీనియర్ డీఓఎం శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

ఆకాశమే హద్దు..

డ్రోన్ల వాడకంపై యువత, రైతులకు శిక్షణ

- తొలిదశలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఏర్పాటు
- కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో రక్షా అకాడమీలో కార్యకలాపాలు
- జిల్లా యువతకు పెరగనున్న ఉపాధి అవకాశాలు

డ్రోన్‌ల వినియోగంలో నూతన శకం ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవ, ప్రోత్సాహంతో సుశిక్షితులైన డ్రోన్ పైలెట్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలతో సహా వివిధ రంగాల్లో విస్తృత ప్రయోజనాలు అందిస్తున్న డ్రోన్‌ల వినియోగం, నిర్వహణపై శిక్షణ ఇచ్చేందుకు ఏపీలో మూడు సంస్థలకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ అనుమతులు ఇచ్చింది. వాటిలో రెండు గుంటూరు జిల్లాలో, ఒకటి శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేశాయి. జీఎంఆర్ గ్రూపు అనుబంధ సంస్థ రక్షా అకాడమీ డ్రోన్ శిక్షణ అందించేందుకు డీజీసీఏ అనుమతులు పొందింది. కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటైన ఈ అకాడమీలో వివిధ కేటగిరీల డ్రోన్‌లపై శిక్షణ, నిర్వహణపై కోర్సులు నిర్వహిస్తున్నారు.



(ఏపీ నెట్‌వర్క్)

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపుతున్నారు. వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగం ద్వారా విప్లవమే తీసుకురావచ్చని భావించి దేశంలో ఎక్కడా లేని విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత, రైతులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడంతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విస్తృత ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటు..

ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ (ఏపీడీసీ)ను 2018 నవంబరులో ఏర్పాటు చేశారు. ఎం.మధుసూదన్‌రెడ్డి దీనికి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేయటంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో డ్రోన్ల వినియోగాన్ని పెంచేందుకు కార్పొరేషన్ కృషి చేస్తోంది. డ్రోన్ టెక్నాలజీ అభివృద్ధి, తయారీ, నిర్వహణ రంగంలో ఉన్న స్టార్టప్ కంపెనీలకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. డీజీసీఏ నిబంధనల మేరకు డ్రోన్ల నిర్వహణను క్రమబద్ధం చేయడంతో పాటు రక్షణాత్మక చర్యలు చేపడుతోంది. డ్రోన్ టెక్నాలజీలో రాష్ట్రాన్ని ప్రపంచంలోనే ఉన్నతంగా నిలబెట్టేందుకు కార్పొరేషన్ కృషి చేస్తోంది.

అన్ని రంగాల్లోనూ డ్రోన్‌ల వినియోగం..

రానున్న కాలంలో రైతులంతా డ్రోన్‌లను వినియోగించే నైపుణ్యం సాధిస్తారని ఏపీ డ్రోన్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆళ్ల రవీంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో డ్రోన్‌ల వినియోగం అన్ని రంగాల్లో పెరిగిపోతోందని చెప్పారు. పరిపాలన, పోలీస్, వ్యవసాయం, గనులు, ఇన్సూరెన్స్, మీడియా, వినోద రంగాల్లో డ్రోన్‌లను వినియోగించటం ద్వారా మానవ వనరులు, సమయం, డబ్బు ఆదా అవుతోందని, కచ్చితత్వం ఉంటోందని చెప్పారు. డ్రోన్ వినియోగ నిబంధనలను పౌర విమానయాన శాఖ సడలించినందున డ్రోన్‌ల అభివృద్ధికి పెద్ద ఎత్తున స్టార్టప్ కంపెనీలు ముందుకొస్తున్నాయని చెప్పారు.

> 'ఎవరైనా డ్రోన్‌ల గురించి మాట్లాడాలంటే.. ముందుగా ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడాలి' – సీఎం జగన్ రాష్ట్రంలో డ్రోన్ వినియోగంపై తీసుకున్న చర్యలతో ఫాపిల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ గోపీరాజా గతంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన ఓ వర్క్‌షాప్‌లో చేసిన వ్యాఖ్యలివి.

సమగ్ర భూ సర్వేతో ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వే కార్యక్రమంలో డ్రోన్‌లను పెద్ద సంఖ్యలో వినియోగిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా కిసాన్ డ్రోన్‌లను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు. వచ్చే నెలలో మరో 500 కిసాన్ డ్రోన్‌లు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ద్వారా రైతులకు డ్రోన్‌ల వినియోగంలో శిక్షణ ఇస్తున్నారు. పంటలకు ఎరువులు వేయటం, పురుగు మందులు చల్లడం వంటివి డ్రోన్‌ల ద్వారా చేపట్టటం ద్వారా వృథాను అరికట్టడంతో పాటు రైతులను ప్రమాదకర పురుగుమందుల బారి నుంచి రక్షించవచ్చు.

నిబంధనలు సరళతరం..

డ్రోన్‌లు లేదా యూఏవీ (అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్)ల నిర్వహణను చట్టబద్ధం చేస్తూ 2021 ఆగస్టు 26న పౌర విమానయాన శాఖ కొత్త పాలసీని ప్రకటించింది. 2022లో నిబంధనలను మరింత సరళతరం చేస్తూ పాలసీలో సవరణలు తీసుకువచ్చింది. 2 కిలోల లోపు బరువు ఉన్న వినోదం కోసం ఉపయోగించే డ్రోన్‌లను ఆపరేట్ చేసేందుకు ఎలాంటి రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ అవసరం లేదు. డ్రోన్‌లను ప్రభుత్వం అయిదు కేటగిరీలుగా వర్గీకరించింది. 250 గ్రాములలోపు బరువు ఉండేది నానో డ్రోన్. 250-2 కిలోల మధ్య బరువు ఉంటే మైక్రో డ్రోన్. 2 కిలోల నుంచి 25 కిలోల మధ్య బరువు ఉండేవి చిన్న డ్రోన్‌లు. 25-150 కిలోల మధ్య బరువు ఉండే డ్రోన్‌లను మధ్యస్థ డ్రోన్‌లుగానూ 150 కిలోల పైగా బరువు ఉండేవాటిని పెద్ద డ్రోన్‌లుగానూ వర్గీకరించారు.

అనుమతులు తప్పనిసరి..

నానో, మైక్రో కేటగిరీల్లోని నాన్ కమర్షియల్ డ్రోన్‌లను మినహాయిస్తే మిగిలిన అన్ని రకాల డ్రోన్‌ల ఆపరేషన్‌కు డిజిటల్ స్కై ఆన్‌లైన్ ప్లాట్ ఫాం నుంచి ముందస్తు అనుమతులు పొందాల్సిందే...డ్రోన్‌ల ద్వారా సరుకుల రవాణా కోసం ప్రభుత్వం ప్రత్యేక కారిడార్‌లను నిర్దేశిస్తుంది. రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ పొందాలంటే అధీకృత సంస్థలో నిర్దేశిత కాలం పైలెట్ శిక్షణ పొంది ఉండాలి. శిక్షణ సంస్థ నుంచి పొందిన సర్టిఫికెట్‌తో పాటు నైపుణ్య పరీక్ష తర్వాత నిర్దేశిత ఫీజు చెల్లిస్తే డీజీసీఏ(సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం) పైలెట్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. ఇది పది సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుంది. ఆ తర్వాత రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. కనీసం టెన్త్ పాసై 18 ఏళ్లకుపైబడి 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, ప్రభుత్వ అనుమతి పొందిన సంస్థలో శిక్షణ పొందిన ఎవరైనా రిమోట్ పైలెట్ సర్టిఫికెట్ పొందేందుకు అర్హులే.

విపత్కర పరిస్థితుల్లోనూ డ్రోన్ సేవలు..



రక్షా అకాడమీలో డ్రోన్ నడుపుతున్న దృశ్యం

రక్షా అకాడమీ ట్రైనర్ జగన్నాథ్ పరిందా మాట్లాడుతూ కొన్ని కష్టతరమైన విధుల నిర్వహణకు డ్రోన్‌లు సహకరిస్తాయన్నారు. తుపాన్లు, వరదలు, భూకంపాల వంటి విపత్కర పరిస్థితుల్లోనూ, ఉగ్రవాద కార్యకలాపాల నిరోధానికి, శాస్త్రీయ పరిశోధనలకు సైతం డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారని చెప్పారు. 2025 నాటికి డ్రోన్ వినియోగ మార్కెట్ 64 బిలియన్ డాలర్లకు చేరనున్నట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ మద్దతుతో ఈ రంగం వేగంగా వృద్ధి చెందుతోందని, ముఖ్యంగా వ్యవసాయం, నిర్మాణం, మైనింగ్, మీడియా, టెలికమ్యునికేషన్స్, లా అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, బీమా, చమురు, గ్యాస్ పరిశ్రమ, రవాణా, విపత్తు నిర్వహణ, సర్వేలు, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ వంటి రంగాల్లో డ్రోన్‌లను వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. సాధారణ పైలెటింగ్ నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక స్థాయి వినియోగం కోసం శిక్షణ ఇవ్వాలని రక్షా అకాడమీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. బెంగళూరుకు చెందిన స్కైవెంజర్ ఏవియేషన్ భాగస్వామ్యంతో శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముంగారు.. లేదు కంగారు!

- కరుణించిన వరుణుడు
- జిల్లా అంతటా 'పదునైన' వర్షం
- 31 మండలాల పరిధిలో 23.5 మి.మీ సగటు వర్షపాతం నమోదు
- వారంలో జోరందుకోనున్న ఏరువాక
- ఆగస్టు 5 వరకు వేరుశనగ, 15 వరకూ కంది, పత్తి, ఆముదం, ఆ తర్వాత ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనువు



అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు జిల్లా అంతటా ఓ మంచి వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 'ముంగారు' రైతులకు ఉపయోగపడేలా దాదాపు జిల్లా వ్యాప్తంగా పదును వర్షం పడింది. 31 మండలాల పరిధిలో ఏకంగా 23.5 మి.మీ భారీ సగటు వర్షపాతం నమోదైంది. ఎక్కడా భారీ వర్షం లేకుండా అటు తక్కువగానూ లేకుండా పంట సాగుకు వీలుగా వరుణుడు మురిపించడంతో రైతు మోము వికసించింది. డి.హిరేహాళ్ 38 మి.మీ, బొమ్మనహాళ్ 36.4 మి.మీ, ఉరవకొండ 35.2, విడపనకల్లు 34.4, బెళుగుప్ప 33.4, బుక్కరాయసముద్రం 33.4, గుంతకల్లు 33.2, యాడికి 31.8, పెద్దవడుగూరు 27.2, కణేకల్లు 27, వజ్రకరూరు 24.8, రాప్తాడు 24.6, పామిడి 24.4, శింగనమల 23, నార్పల 22.8, ఆత్మకూరు 22.4, కూడేరు 22, కుందుర్పి 20.6, గార్లదిన్నె 20.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లోనూ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం వరకూ 20 మండలాల్లో సాధారణం కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది. అయితే ఒకే రోజు 23.5 మి.మీ సగటు నమోదు కావడంతో 6 మండలాల్లో సాధారణం కన్నా అధికంగా, 18 మండలాల్లో సాధారణం నమోదు కాగా కేవలం 7 మండలాల్లోనే తక్కువ వర్షపాతం నమోదైంది. మొత్తంగా జూలై నెల సాధారణ వర్షపాతం 63.9 మి.మీ కాగా ఇప్పటికే 73.2 మి.మీ నమోదవడం విశేషం. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 117.9 మి.మీ గానూ 119 మి.మీ నమోదైంది. 17 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. అందులో తాజాగా నమోదైన 23.5 మి.మీ సగటే అత్యధికం కావడం విశేషం. దీంతో ఖరీఫ్ చివరి వారంలో ఏరువాక జోరందుకోనుంది. ప్రస్తుతానికి 3.70 లక్షల హెక్టార్లకు గానూ 1.20 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు.

త్వరపడాలి రైతన్నా...!

ఖరీఫ్ సాగుకు సమయం చాలా తక్కువగా ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా విత్తనాలు విత్తుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.సంపత్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ప్రధాన పంట వేరుశనగ సాగుకు ఈ నెలాఖరు వరకే మంచి సమయం ఉన్నా.. ఆగస్టు 5 వరకు ఇబ్బంది లేదన్నారు. కంది, ఆముదం, పత్తి లాంటి ఇతర ముఖ్యమైన పంటలు ఆగస్టు 15 వరకు విత్తుకోవచ్చన్నారు. ఆ తర్వాత ప్రత్యామ్నాయ పంటలు మేలని చెప్పారు. జిల్లా అంతటా పదును వర్షం అయినందున రైతులు ఆలస్యం చేయకుండా ఈ వారంలోపు పంటలు విత్తుకోవాలని సూచించారు.

భవితకు బంగారు బాట

- 'జగనన్న విదేశీ విద్యా దీవెన' సువర్ణావకాశం
- జిల్లాలో ఐదుగురికి రూ.71.29 లక్షలు మంజూరు
- మంత్రి ఉష శ్రీచరణ్, కలెక్టర్ గౌతమి
- లబ్ధిదారులతో కలిసి మెగా చెక్ విడుదల



లబ్ధిదారులకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన' మెగా చెక్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ''ఉన్నతమైన విద్యను అందించడం ద్వారా భావితరాలకు అమూల్యమైన ఆస్తిని ఇచ్చినట్లేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పదేపదే చెబుతుంటారు. ఆ దిశగా విద్యకు అత్యంత ప్రాధానతనిస్తూ పలు సంస్కరణలు తీసుకొచ్చారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు 'జగనన్న విదేశీ విద్యాదీవెన' పథకం ద్వారా సువర్ణావకాశం కల్పిస్తున్నారు.'' అని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ మంత్రి ఉష శ్రీచరణ్, కలెక్టర్ ఎం.గౌతమి అన్నారు. సీఎం వైఎస్ జగన్ గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి విదేశీ విద్యాదీవెన పథకం కింద ఎంపికైన విద్యార్థులకు ఫీజును కంప్యూటర్ బటన్ నొక్కి వారి ఖాతాల్లో నేరుగా జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి మంత్రి ఉష శ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి, కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా మొదటి విడత కింద ముగ్గురు విద్యార్థులకు, రెండో విడత కింద ఇద్దరికి రూ.71,29,005 ఫీజు మంజూరు చేశారన్నారు. ఆర్థిక భారంతో పేదలు ఉన్నత విద్యకు దూరం కాకూడదనేదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. కార్పొరేట్‌కు ధీటుగా పేదలకూ నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా కేజీ నుంచి పీజీ వరకు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రమూ చేయని విధంగా విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. నాడు-నేడు ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాల రూపు రేఖలను మార్చారన్నారు. విద్యాభివృద్ధికి అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన అమలు చేస్తున్నారన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు 'జగనన్న వీదేశీ విద్యాదీవెన పథకం' ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ''ఆల్ ద బెస్ట్'' చెప్పారు. విదేశాల్లో చదువు పూర్తైన తరువాత ఇక్కడికే వచ్చి దేశానికి, ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మెగా చెక్ విడుదల చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి, డీటీ డబ్ల్యూఓ అన్నాదొర, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటా



లండన్‌లో ఆర్ట్స్ అండ్ డిజైనింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నా. 'జగనన్న విదేశీ విద్యాదీవెన' కింద రూ.39,38,256 ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేశారు. మొదటి విడతగా రూ.9.84 లక్షలు అందించారు. పేద వర్గానికి చెందిన మాలాంటి వారికి ఆర్థిక సాయం అందించి విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటా.

– చిన్న కందుకూరి సునీల్ రాజా అమీన్, గుత్తి మండలం, గుత్తి ఆర్ఎస్

రూ.21.65 లక్షలు మంజూరు చేశారు



మాది మధ్యతరగతి కుటుంబం. చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మా అమ్మాయి శ్రీప్రియ యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ గ్లాస్గోలో ఎంఎస్ (కార్డియో వస్క్యులర్) మొదటి సంవత్సరం చదువుతోంది. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద రూ.21,65,665 ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేశారు. మొదటి విడతగా రూ.10,82,833 అందించారు. పేద వర్గాల పిల్లలు విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించిన సీఎంకు ధన్యవాదాలు.

– ఉమామహేశ్వరి, శ్రీనివాసులు, పామిడి మండలం



నేడు హెచ్చెల్సీకి నీరు

బొమ్మనహాళ్/అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయానికి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. గురువారం ఒక్క రోజే 10 టీఎంసీల నీరు చేరింది. బుధవారం 98,357 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో గురువారం ఉదయానికి 1,11,566 క్యూసెక్కులకు పెరిగింది. మంగళవారం 40 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, బుధవారం ఉదయానికి 50 టీఎంసీలకు చేరింది. ఈ క్రమంలో శుక్రవారం హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయనున్నారు. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాలైన మలెనాడు, శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్‌మగళూరు, వరనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాంకు వరద భారీగా వచ్చి చేరుతోంది. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1,615.56 అడుగులకు చేరింది. ఈ ఏడాది ఆయకట్టులో వరి, మిరప పంటలు సాగు చేసేందుకు ఇప్పటికే రైతులు బోరు బావుల కింద నారుమడులు వేసుకుని సిద్ధంగా ఉన్నారు. హెచ్చెల్సీకి శుక్రవారం జలాశయం నుంచి నీరు విడుదలవుతున్న నేపథ్యంలో ఎస్ఈ రాజశేఖర్, ఈఈ వెంకటరమణారెడ్డి సరిహద్దులోని హెచ్చెల్సీ కాలువను పరిశీలించారు. కాలువపై గస్తీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

దిగిరాని టమాట

- కక్కలపల్లి మండీలో కిలో రూ.132 పలికిన ధైనం



అనంతపురం అగ్రికల్చర్: సామాన్యులకు అందకుండా కొండెక్కి కూర్చున్న టమాట దిగిరానంటోంది. గురువారం అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.132 మేర పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 105 టన్నుల కాయలు అమ్మకానికి రాగా వాటిని వేలం వేశామన్నారు. అందులో కిలో గరిష్టంగా రూ.132, కనిష్టంగా రూ.100, సరాసరిన రూ.116 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయని వెల్లడించారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో గొంతు కోసుకున్నాడు!

- ఒడిశా వాసి అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ



వికాస్ మృతదేహం (ఫైల్)

పెనుకొండ: ఒడిశాకు చెందిన యువకుడి అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. మద్యం మత్తులోనే గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. వివరాలను గురువారం ఎస్ఐ రమేష్ బాబు వెల్లడించారు. పెనుకొండ సమీపంలోని కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్న ఒడిశాకు చెందిన వికాస్ (27) బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. కొంతకాలంగా పెనుకొండలోని అల్విన్ కాలనీలో సోదరుడు రాజు, మరి కొందరు కార్మికులతో కలసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతిగా మద్యం సేవించడం అలవాటున్న వికాష్ బుధవారం గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో మద్యం మత్తులో కత్తితో గొంతుకోసుకున్నాడు. ఈ అంశాన్ని తన మొబైల్‌లో రికార్డు చేశాడు. కాగా, తొలుత అనుమానాస్పద మృతి కింద దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడి సెల్ ఫోన్‌లోని దృశ్యాలు చూసి ఆత్మహత్యగా నిర్ధారిస్తూ కేసు నమోదు చేశారు.



కనులపండువగా గూగూడు బ్రహ్మోత్సవాలు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున స్వామిని ప్రత్యేక పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. స్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి.

శుక్రవారం పెద్ద సరిగెత్తు, శనివారం తెల్లవారుజామున 2 గంటలకు గ్రామోత్సవం, ఉదయం 6 గంటలకు అగ్నిగుండం ప్రవేశం, సాయంత్రం మూడు గంటలకు గ్రామోత్సవం, జలధి కార్యక్రమం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు రమణకుమారి, ఈఓ శోభ, కో ఆప్షన్ సభ్యురాలు షాబీరా, ఎంపీటీసీ సభ్యుడు రాజారెడ్డి, నాయకులు గోపాల్, సూర్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీలకు శుభవార్త

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్లకు (సీఆర్పీ) శుభవార్త. రెక్వెస్ట్ బదిలీలకు ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వివరాలను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి (ఏపీఓ), జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 29 మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయవచ్చని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం దరఖాస్తులను స్క్రూటినీ చేసి తాత్కాలిక మెరిట్ జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు తెలియజేయాలన్నారు. అదేరోజు 3 గంటలకు ఫైనల్ మెరిట్ జాబితా ప్రకటిస్తామన్నారు. తర్వాత కౌన్సెలింగ్ చేపట్టి బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించారు ప్రత్యేక కేటగిరీ కింద బదిలీ కోరకునేవారు సంబంధిత స్పౌజ్/మెడికల్/పీహెచ్ సర్టిఫికెట్లను దరఖాస్తుకు జత చేయాలని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న సీఆర్పీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- హంద్రీనీవాకు రెండు సార్లు శంకుస్థాపన తప్ప చేసిందేమీ లేదు
- వైఎస్సార్ చొరవతోనే హంద్రీ-నీవా కాలువ పనులు
- చంద్రబాబు పాలనంతా దుర్భిక్షమే
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: తాను సీమ వాసిగా చెప్పుకునే చంద్రబాబు.. ముఖ్యమంత్రిగా రాయలసీమ అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. రాయలసీమ ప్రాంతానికి ద్రోహం చేసిన వారిలో చంద్రబాబు తప్ప మరెవ్వరూ లేరన్నారు. విడపనకల్లు మండలం పాలికి గ్రామంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏ ప్రాజెక్టు పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు.హంద్రీ-నీవాకు రెండు సార్లు శంకుస్థాపన చేసిన ఆయన గంపెడు మట్టి కూడా తీయించలేకపోయాడన్నారు. 40 టీఎంసీల హంద్రీనీవా ప్రాజెక్టును 4 టీఎంసీలకు కుదించింది కూడా చంద్రబాబునేనన్నారు. చంద్రబాబు పాలనంతా రాష్ట్రమంతటా దుర్భిక్షం తాండవించిందన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు కూడా చంద్రబాబుకు లేదన్నారు. రైతు వ్యతిరేక పాలనతో అన్నదాతల ఆత్మహత్యలకు చంద్రబాబు కారకుడయ్యారన్నారు. ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్సార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రూ.వేల కోట్ల నిధులతో హంద్రీ-నీవా ప్రాజెక్ట్‌లో 80 శాతం పనులు పూర్తి చేయించారని గుర్తు చేశారు. హంద్రీ నీవా పేరు చెబితే రాయలసీమలో గుర్తుకు వచ్చేది వైఎస్సారేనన్నారు. రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యతనిచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వైఎస్సార్ అన్నారు. అదే బాటలో సీఎం వైఎస్ జగన్ నడుస్తూ వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. సంక్షేమ విప్లవాన్ని కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. జగన్ పాలనలో ప్రతి ఒక్కరూ ఆత్మస్థైర్యంతో జీవిస్తున్నారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడిన అంశం చంద్రబాబుకు కనిపించకపోవడం ఆయన దౌర్భాగ్యమన్నారు. ఎన్నికల సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో అధికారం కోసం సీఎం జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ గారడీ విద్యకు తెర లేపారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపడం ఎవరి తరం కాదన్నారు. సమావేశంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచ్ బోయ దేవేంద్ర, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కలికిరి కళాశాల ప్రిన్సిపాల్‌గా విశాలి

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) పరిధిలోని కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్. విశాలి నియమితులయ్యారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సి. శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పులివెందుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా అక్కడే మేథమేటిక్స్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఎం. సూర్యనారాయణ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. పులివెందుల ఈఈఈ విభాగాధిపతిగా డాక్టర్ షేక్ హుస్సేన్ వలి, పులివెందుల ఈసీఈ విభాగాధిపతిగా డాక్టర్ షేక్ తాజ్ మహబూబ్, కలికిరి మెకానికల్ విభాగాధిపతిగా డాక్టర్ డీ.ఆర్. శ్రీనివాసన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా జిల్లాలోకి తరలించుకుని వచ్చిన కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెబ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన అనంతపురం సెబ్ పోలీసులు గురువారం ఉదయం టీవీ టవర్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన టాటా ఇండికా కారును ఆపి తనిఖీ చేయగా 12 బాక్సుల్లో తరలిస్తున్న 1,152 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. దీంతో మద్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లి గ్రామానికి చెందిన జె.పెద్దిరెడ్డి, అనంతపురంలోని భవానీనగర్ నివాసి బి.జగన్‌సింగ్‌ని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు



ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న జడ్జి దీనబాబు

బుక్కరాయసముద్రం: జిల్లా జైల్లో ఉన్న ఖైదీలకు 24 గంటలూ న్యాయ సేవలు అందించేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి దీనబాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జిల్లా జైల్లో ఖైదీలతో సమావేశం నిర్వహించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. జడ్జి దీనబాబు మాట్లాడుతూ నిరుపేద ఖైదీలకు న్యాయ ప్రాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు. న్యాయ సేవ లభ్యత, అప్పీల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: తాడిపత్రిలో వెలసిన చింతల వేంకటరమణ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ ఆదిశేషు నాయుడు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఆగస్టు 15వ తేదీ లోపు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను అనంతపురంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న ఎండోమెంటు కార్యాలయంలో అందజేయాలి.

రోగులకు అందుబాటులో ఉండండి



సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్

పెద్దపప్పూరు: రోగులకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. పెద్దపప్పురులోని పీహెచ్‌సీతో పాటు అంగన్ వాడీ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్‌కుమార్, ఉషా రాణి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

30న విద్యుత్ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యుత్ ఉద్యోగుల కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఈ నెల 30న అనంతపురం రాజేంద్ర నగర పాలక సంస్థ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి రోషన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 35 మంది నామినేషన్లు వేయగా, 23 మంది అభ్యర్థుల నామినేషన్లు అర్హత సాధించినట్లు వెల్లడించారు. 30న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,800 మందికిపైగా ఉద్యోగులు సొసైటీలో ఓటర్లుగా ఉన్నారన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి




ఎంపికైన నిఖ్యాతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరానికి చెందిన క్రీడాకారిణి నిఖ్య ఎంపికైంది. ఈ మేరకు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి గురువారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన నిఖ్యను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఆగస్టు 3 నుంచి 9వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరుపున ఆమె ప్రాతినిథ్యం వహించనున్నట్లు వివరించారు. ప్రతిభ చూపిన నిఖ్యాను గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

విప్లవోద్యమ దిక్సూచి

- ప్రజానాయకులు తరిమెల, దేవులపల్లి సంస్మరణ సభ నేడు



తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు

అనంతపురం కల్చరల్: కమ్యూనిస్టు విప్లవోద్యమంలో యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచిన తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావుల నిరుపమాన త్యాగాలను స్మరించుకునే అవకాశం మరోసారి వచ్చింది. పీడిత, తాడిత ప్రజల శ్రేయస్సు కోసం 35 ఏళ్లకు పైగా పోరాడి, వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న తరిమెల నాగిరెడ్డి 1917, ఫిబ్రవరి 11న తరిమెల గ్రామంలో జన్మించారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా దోపిడీ వ్యవస్థను భూస్థాపితం చేయడానికి, పీడనలు లేని సమసమాజ స్థాపనకు విద్యార్థి దశ నుంచే ఆయన పోరుబాట పట్టారు. తన సర్వస్వాన్ని పీడిత వర్గ ప్రజల శ్రేయస్సుకే అర్పించి 'ప్రజా నాయకుడు టీఎన్'గా అనంత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన రచనలు ఎందరో మేధావులను సైతం కదిలించాయి. జీవితాన్ని విప్లవోద్యమాలకే అంకితం చేసిన ఆయన 1975లో మరో విప్లవ యోధుడు దేవులపల్లి వెంకటేశ్వరావుతో కలసి యుసీసీఆర్ఐ (ఎంఎల్)ను స్థాపించారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం అలుపెరగని పోరు సాగిస్తూ తరిమెల నాగిరెడ్డి 1976, జులై 28 ఈ లోకాన్ని వీడారు. నిష్కలమైన వారి స్నేహానికి గుర్తుగా ఏటా ఇద్దరి సంస్మరణ సభను టీఎన్ వర్ధంతి నాడు అభిమానులు నిర్వహించుకోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు అనంతపురంలోని ఉపాధ్యాయభవన్ వేదికగా భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (ఎంఎల్) ఆధ్వర్యంలో సంస్మరణ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. విరసం మాజీ సభ్యుడు సాహితీవేత్త జెట్టీజైరాం, భారత-చైనా మిత్రమండలి రాష్ట్ర కార్యదర్శి వై.అజయ్‌రెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరు కానున్నారు.

ప్రాణదాతలకు కృతజ్ఞతలు

- జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్యాయత్నం
- సకాలంలో స్పందించిన పోలీసులు
- చికిత్స అనంతరం కోలుకుని పోలీసులను కలసి కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు



వన్నూరుస్వామితో పోలీసులు

కళ్యాణదుర్గం: జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని పోలీసులు సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి, ప్రాణాలు కాపాడారు. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న అనంతరం ఆ యువకుడు పోలీసులను కలసి కృతజ్ఞతలు తెలిపాడు. వివరాలు.. శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన వన్నూరుస్వామి వారం రోజుల క్రితం కుటుంబ సమస్యలతో విసుగు చెంది జీవితంపై విరక్తితో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు రోడ్డు పక్కన పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో పడి ఉన్న యువకుడిని అదే సమయంలో అటుగా వెళ్లిన పట్టణ సీఐ తేజమూర్తి, ఎస్ఐ నాగమధు గమనించి, వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న వన్నూరు స్వామి గురువారం కళ్యాణదుర్గానికి వచ్చి నేరుగా తనను కాపాడిన పోలీసులను కలసి కృతజ్ఞతలు తెలిపాడు. తన తల్లి మరణించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు వివరించాడు.

ఏకకాలంలో రెండు డిగ్రీలకు అవకాశం

- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్య బోధన
- ఈవిద్యాసంవత్సరం 358 సీట్లకు 2.20 లక్షల దరఖాస్తులు
- సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ డాక్టర్ ఎస్.ఏ కోరి



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో వివిధ కోర్సులకు సంబంధించి మల్టీ ఎంట్రీ, మల్టీ ఎగ్జిట్ విధానం పాటిస్తున్నామని, దీంతో మేజర్, మైనర్ రెండు డిగ్రీలను ఏకకాలంలో తీసుకునే అవకాశం ఉందని వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.ఏ కోరి తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన సెంట్రల్ వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. మారుతున్న పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యా ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కేలా ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశామన్నారు. పీజీ విద్యార్థులకు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్న ఉద్దేశంతో మానవ విలువలు, పర్యావరణం, భారత రాజ్యాంగం, సైబర్ సెక్యూరిటీ వంటి సబ్జెక్టులను తప్పనిసరి చేశామన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో 21 రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఈ ఏడాది యూజీ, పీజీ కోర్సుల్లోని 358 సీట్లకు గాను 2.20 లక్షల దరఖాస్తులు అందాయన్నారు. 2024లో జంతలూరు క్యాంపస్ నుంచి తరగతులు నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ డీన్ రాంరెడ్డి, సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ కరీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి



పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతి చెందిన సునీల్

రాయదుర్గం టౌన్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సునీల్ (25) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ తల్లి, సోదరిని పోషించుకుంటున్నాడు. స్థానిక శనిమహాత్ముడి ఆలయం సమీపంలో గురువారం ఉదయం భవన నిర్మా:ణ పనుల్లో పాల్గొన్న సునీల్ ఓ ఇనుప కడ్డీని పైకి ఎత్తుతున్న సమయంలో పైనున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సునీల్‌ను వెంటనే తోటి కార్మికులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

టీ హోటల్లో చోరీ



చోరీ చేస్తున్న యువకుడు (సీసీ ఫుటేజీ)

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని చాయ్ మహల్ హోటల్లో చోరీ జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ దుండగుడు హోటల్లోకి చొరబడి రూ.13వేలు నగదుతో పాటు రూ.15 వేలు విలువైన సిగరెట్లు అపహరించుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. ఘటనపై బాధితుడు ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీ

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామ శివారులో ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాత్రి పూట గ్రామస్తులు ఎవరూ అటువైపుగా వెళ్లలేదు. గురువారం మధ్యాహ్నం ఆలయం వద్దకు వెళ్లిన స్థానికులు హుండీ బద్ధలుగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ లక్ష్మణ్ణ పరిశీలించారు. మూడేళ్లుగా హుండీ కానుకలను లెక్కించలేదని, రూ.75 వేల వరకూ పోగై ఉండవచ్చునని గ్రామస్తులు అంచనా వేశారు. గ్రిల్ గేటుకున్న తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన ఆగంతకుడు ఇనుపచువ్వతో హుండీని తెరిచినట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

6న జాతీయ కవితోత్సవం

పెనుకొండ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఆగస్టు 6న హిందూపురంలో జాతీయ కవితోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, నిర్వాహకులు ఉమర్‌ఫారూక్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో వంద మంది కవులు, 10 మంది విశిష్ట అతిథులు పాల్గొంటారన్నారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న కవులు, మేధావులు ఈ నెల 30వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 63007 62315, 93469 43336, 94408 05955, 94409 29894, 73822 68554లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రైతులకు నాణ్యమైన ఎరువులు



మోదీ నిర్వహించిన లైవ్‌టెలికాస్ట్‌లో పాల్గొన్న డీఏవో, ఏడీఏ, ఏవో, రైతులు, డీలర్లు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. గురువారం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన (పీఎంకేఎస్‌కే)లో భాగంగా స్థానిక రుద్రంపేట సమీపంలో ఎరువుల దుకాణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి సందేశాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ ఎం.రవి, ఏవో శశికళ, రూరల్ అగ్రిబోర్డు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

ఆత్మకూరు: పంపనూరు తండాకు చెందిన లక్ష్మక్క ఈనెల 23న రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. లక్ష్మక్క భర్త సోమ్లానాయక్‌కు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు గురువారం అందించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ అశోక్ నాయక్, పంచాయతీ సెక్రటరీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ముట్టాలలో 'జగనన్న సురక్ష'



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమలత మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా పథకాలు అందిస్తుందన్నారు. ఏ సమస్య ఉన్నా అధికారులుగానీ ప్రజాప్రతినిధులకు గానీ తెలియజేయాలన్నారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, సర్పంచ్ తిరుపాలమ్మ తదితర అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక ఆదాయం

- జిల్లా పట్టుపరిశ్రమశాఖ అధికారి ఆంజనేయులు



ఆత్మకూరులో మల్బరీసాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి ఆంజనేయులు

ఆత్మకూరు: మల్బరీ సాగు చేసే రైతులు అధిక లాభాలను పొందొచ్చని జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి ఆంజనేయులు రైతులకు సూచించారు. గురువారం ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కల్పించారు. మల్బరీ సాగు ఏ విధంగా చేయాలి, మెలకువలు రైతులకు వీడియోల ద్వారా తెలియజేశారు. డాక్టర్ వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పట్టు సాగు చేయడానికి షెడ్‌తో మొదలుకొని పంట అన్ని విధాల సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. అనంతరం మల్బరీ సాగు చేసే విధానంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, సెరికల్చర్ అధికారి మెహతాజ్, వీఎస్‌ఏ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్నేహిత్‌సింహాకు సన్మానం



విద్యార్థి స్నేహిత్ సింహాను అభినందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: స్విమ్మింగ్‌లో వరల్డ్ బుక్‌ఆఫ్ ఇండియాలో స్థానం సంపాదించిన విద్యార్థి స్నేహిత్ సింహాను నగరంలోని ఎస్‌ఆర్‌ఐ విద్యా సంస్థల ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. విద్యాసంస్థల్లో నిర్వహించిన అభినందన సభలో చైర్మన్ వెన్నపూస విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం చియ్యేడుకు చెందిన ఆరోతరగతి విద్యార్థి స్నేహిత్ సింహా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం చేసుకున్నాడన్నారు. నీటిలో 2 గంటలా 21 నిమిషాల 53 సెకండ్లు తేలియాడిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు కైవసం చేసుకున్నాడన్నారు. జూన్ 19న స్విమ్మింగ్ పూల్‌లో తన ప్రదర్శనను ఆన్‌లైన్ వీడియో చేశాడన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన స్నేహిత్ సింహా, కోచ్ రాహుల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ విద్యా సంస్థల ఎండీ చంటి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: పేదలను అన్ని రకాలుగా ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 11వ డివిజన్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులను ఎమ్మెల్యే అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఇతర సమస్యలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలియజేయాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా ఉన్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్, చంద్రబాబు విమర్శలు చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలో 23 వేల మందికి పట్టాలిచ్చి సొంతిళ్ల సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కామారుపల్లిలో పట్టా పొందిన వారికి కొడిమి, రాచానపల్లి, కురుగుంట ప్రాంతాల్లో కేటాయించనున్నట్లు తెలిపారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు:
అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ అని సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి రాయలసీమ ద్రోహిగా నిలిచారని ఎమ్మెల్యే విమర్శించారు. కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రూపకల్పన చేసిన విషయాలను తెలియజేశారు. 'అనంత'కు కృష్ణా జలాలు తెచ్చిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. అనంతరం సూర్యానగర్ 80 అడుగుల రోడ్డు ఎస్క్యాప్ నిధులు రూ.1.98 కోట్లతో ప్రధాన రోడ్డు, విస్తరణ పనులకు ఎమ్మెల్యే అనంత భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్ రాగేపరుశురాం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు రామాంజినమ్మ, దేవి, బాబాఫక్రుద్దీన్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి సేవలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: తిరుమల క్షేత్రంలో శ్రీనివాసుడికి జరిగే ప్రతి సేవను అనంత వాసుల ముంగిటకు చేర్చడానికి సాయిట్రస్టు ఆధ్వర్యంలో వైకుంఠ వాసుని సేవలో ఒకరోజు పేరిట మరో గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈనెల 28, 29 తేదీల్లో గుత్తిరోడ్డులోని శ్రీ 7 ఫంక్షన్ హాలులో వేంకటేశ్వర వైభవం పేరిట జరగనున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే పలువురు ఆధ్యాత్మిక వేత్తలతో పాటు మంత్రి ఉష శ్రీచరణ్, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమి ఇతర ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

వినూత్నంగా శ్రీవారి సేవలు : జిల్లాలో తొలిసారి ఈ విధమైన ఆధాత్మిక కార్యక్రమం జరుగుతోంది. శుక్రవారం సాయంత్రం ఊంజల సేవ, అష్టదళ పద్మార్చన, సహస్ర దీపాలంకరణ, పవళింపు సేవలు ఉంటాయి. శనివారం ఉదయం సుప్రభాత సేవ, స్థాపన తిరుమంజనం, పుష్పయాగం, తోమాలసేవ, తిరుప్పాడ సేవ, కల్యాణోత్సవం, రాత్రి పవళింపు సేవలతో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర తెలిపారు.



సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



నాగభూషణం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మదిగుబ్బకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాగభూషణం గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని నాగభూషణం ఇంటికి చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడకండి.. అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేంద్రం మోసాన్ని సీమ సహించదు

- రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం అర్బన్: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వీలుకాదని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వ మోసాన్ని సీమ సహించదని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. కడప ఉక్కు రాయలసీమ ప్రజల హక్కు అని, కేంద్రం చేసిన ఏకపక్ష ప్రకటనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం పదేపదే తూట్లు పొడుస్తోందన్నారు. చట్టబద్ధంగా ఇచ్చిన హామీలను ఉల్లంఘించి, రాయలసీమ ప్రజలకు కేంద్రం అన్యాయమే చేస్తోందన్నారు. విభజన హామీలను నెరవేర్చకపోవడం కేంద్ర ప్రభుత్వపు రాజకీయ అవకాశవాదానికి, మోసపూరిత విధానాలకు నిదర్శనమన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ రాయలసీమ భవిష్యత్ పారిశ్రామికీకరణకు ఓ అవసరమన్నారు. దాన్ని కాదనే వారికి సీమ ప్రజలకు తగిన బుదిచెబుతారన్నారు. సాంకేతిక అంశాల మాటున, రాయలసీమను మోసం చేయాలని చూస్తే...అందుకు తగిన మూల్యం చెల్లించడానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

రాప్తాడు: మండలంలో అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గొందిరెడ్డిపల్లి, ఎం.బండమీదపల్లి, హంపాపురం, గంగలకుంట, బోగినేపల్లి, మరూరు, జి.కొత్తపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో పీర్ల చావిడి ముందున్న అగ్ని గుండాన్ని తవ్వి వేడుకలు నిర్వహిస్తున్నారు. వేడుకలకు జిల్లా లోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కులు తీర్చుకోనున్నారు.

గ్రామాల్లో జరిగే కార్యక్రమాలు ఇలా..
గొందిరెడ్డిపల్లిలో వెలసిన జల్లమ్మ స్వామికి భక్తులు శనివారం పెద్ద సరిగెత్తు రోజున పెద్ద ఎత్తున చక్కర చదివింపు చేయనున్నారు. జల్లమ్మ బావి వద్ద ఉన్న దర్గా వద్దకు వందలాది మంది మహిళలు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేస్తారు. భక్తులు బస్తాల కొద్దీ చక్కెరను చదివిస్తారు. కార్యక్రమంలో జల్లమ్మ స్వామి కాపులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేస్తారు. ఆయా గ్రామాల్లో శనివారం రాత్రి పెద్ద సరిగెత్తును మండల ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ఆదివారం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగిస్తారు. అదేరోజు సాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహిస్తారు.

ఆత్మకూరు: మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహిస్తున్నారు. గురువారం పానకాలను పీర్లచావిడికి తీసుకొచ్చి చదివించారు. భక్తులు పీర్ల చావిడితో పీర్లకు, ఆత్మకూరులో కొలువుదీరిన సర్దార్‌వలి దర్గాలో చక్కెర చదివింపులు చేయించారు. శుక్రవారం పెద్ద సరిగెత్తు , 29న జలధి ఉంటుందని గ్రామపెద్దలు తెలిపారు. సర్దార్‌వలి దర్గా వద్ద శుక్రవారం భక్తులు అన్నదానం చేయనున్నారు.



ఆత్మకూరులో కొలువుదీరిన పీర్లు

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తనిఖీ

అనంతపురం క్రైం: జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ వివరాలను డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యంను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందే సేవల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. జీజీహెచ్‌కు వచ్చే అత్యవసర కేసులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో సూపరింటెండెంట్ , అదనపు ఎస్పీ హనుమంతు మొక్కలు నాటారు. అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాల్సిందే

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి , సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిందేనని బోధనేతర సంఘం అధ్యక్షుడు పి.ఆదినారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతలింగం, ఉపాధ్యక్షుడు ఎం.రాము ఓ ప్రకటనలో కోరారు. సంక్షేమ పథకాల ప్రదాత అయిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు వీలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహం ఏర్పాటును కొన్ని విద్యార్థి సంఘాలు అడ్డుకుంటామని చెప్పడం దుర్మార్గమన్నారు. సంక్షేమ పథకాలు అందించి చరిత్రలో చోటు దక్కించుకున్న మహనీయుడు అయిన డాక్టర్ వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసి తీరుతామని స్పష్టం చేశారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహంతో పాటు క్యాంపస్‌లో భారత తొలి మహిళా సంఘసంస్కర్త , మహిళా అధ్యాపకురాలు సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేస్తామని వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పేర్కొనడం విద్యపై ఆయనకు ఉన్న మక్కువ, సమానతకు నిదర్శనమన్నారు.

రేపు ఎమ్మెల్సీలకు సన్మానం

రాప్తాడురూరల్: విజయవాడలో ఈనెల 29న ఎమ్మెల్సీలు కల్పలత, ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డికి ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భూభౌతిక, రసాయన అంశాలపై అవగాహన

అనంతపురం అగ్రికల్చర్: భూమి భౌతిక, రసాయన లక్షణాలు, వాటికి సంబంధించి విషయ పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్-ఎస్‌టీఎల్) ఏడీఏ రోజాపుష్పలత తెలిపారు. పది రోజుల ప్రాజెక్టులో భాగంగా ఎస్కేయూలో రసాయన శాస్త్రంలో రెండో సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థుల బృందం ఎస్‌టీఎల్‌లో శిక్షణకు గురువారం వచ్చారు. ఎస్‌టీఎలా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయం, పంట ఉత్పత్తి, ఉత్పాదకశక్తి, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, భావి తరాలకు మంచి భూమి అందించే క్రమంలో భూసంరక్షణ చాలా కీలకమన్నారు. మట్టి నమూనాల సేకరణ విధానం, ప్రయోగశాలలో వాటి విశ్లేషణ, ఫలితాలు, వాటి ఆధారంగా పాటించాల్సిన పోషక యాజమాన్యం గురించి ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ప్రధానంగా పీహెచ్ (భూమి స్థితి) శాతం ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్పరస్ (పీ), పోటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూల పోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), అలాగే సూక్ష్మపోషకాలు (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించే క్రమంలో చేపట్టాల్సిన 12 రకాల పరీక్షలపై విశదీకరించారు.



ఎస్కేయూ పీజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రోజాపుష్పలత

ఘనంగా గ్రామసిరి 13వ వార్షిక మహాసభ

రామగిరి: మండల కేంద్రంలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో గురువారం గ్రామసిరి 13వ వార్షిక మహాసభ ఘనంగా నిర్వహించారు. సంస్థ సీఈఓ తిరుమలాదేవితోపాటు సొసైటీ అధ్యక్షుడు సంగప్ప, ప్రోగ్రాం మేనేజర్‌లు రమేష్‌కుమార్, మహేష్, సుకన్య, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ సంస్థ రామగిరితోపాటు చెన్నేకొత్తపల్లి, రొద్దం మండలాలలో విస్తరించి గ్రామసిరి ద్వారా భూమిలేని పేద కూలీలకు జీవాల సంరక్షణ చేపట్టిందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కనగానపల్లి: పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు.గురువారం మండలంలోని ముక్తాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు నాగముని, గంగుల సుధీర్‌రెడ్డి, స్థానిక సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం

అనంతపురం అర్బన్: కలెక్టర్ ఎం.గౌతమిని రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కుమ్మరుల అభ్యున్నతికి సహకారం అందించాలని కోరారు.

కలాం ఆశయాలు కొనసాగించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను కొనసాగించాలి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దన్నగౌడు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు శీలా జయరామప్ప, రామకృష్ణ, ప్రభాకర్, వేణుగోపాల్, క్రిష్టప్ప, సత్యనారాయణ, మధు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మినర్వా స్కూల్‌లో 'మాన్సూన్ డే'



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

రాప్తాడురూరల్: అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో వర్ష రుతువుపై విద్యార్థుల్లో అవగాహన కలిగించడానికి గురువారం 'మాన్సూన్ డే' ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలు రెయిన్ కోట్లు, గొడుగులు, టోపీలు ధరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి వేడిమిని చల్లని చినుకులతో వర్షాలు దూరం చేస్తాయన్నారు. భూమిపై సమస్త జీవులను వర్షాకాలం ఆనందింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పడిపోతున్నా పట్టించుకోరా?

అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డు వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్ ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయాల్లో గాలి, వర్షం అధికంగా వచ్చినప్పుడు ట్రాఫిక్ సిగ్నల్ లైట్ స్తంభం విరిగిపడే అవకాశం ఉంది. శని ఆదివారాల్లో మార్కెట్ యార్డు వద్ద పశువులు, జీవాల సంత జరుగుతుంది. పొరపాటున అటుగా వెళ్లే వాహనదారులపై సిగ్నల్ లైట్ పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సిగ్నల్ లైట్‌ను మరమ్మతు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



అనంత కథకుడికి అరుదైన గౌరవం

అనంతపురం కల్చరల్: వచ్చేనెల 3 నుంచి 6 వతేదీ వరకు ఉన్మేష: పేరుతో భోపాల్‌లో జరిగే అంతర్జాతీయ సాహిత్యోత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన సీనియర్ రచయిత డాక్టర్ శాంతి నారాయణను ప్రతినిధిగా ఎంపిక చేశారు. ప్రపంచం నలుమూలల నుంచి దేశ విదేశాలకు చెందిన ప్రసిద్ధ రచయితలు, కవులు, సాహితీవేత్తలు, విమర్శకులు, జానపద సాహిత్య కళాకారులు, ప్రఖ్యాత గాయనీగాయకులు వివిధ విభాగాలకు ప్రాతినిథ్యం వహిస్తారు. కథా విభాగంలో డాక్టర్ శాంతినారాయణ రాసిన కథ 'బతుకు బంతి' ప్రత్యేకంగా ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న సదస్సులో వివిధ ప్రక్రియలలో 1000 మందికి పైగా సాహితీవేత్తలు పాల్గొని, తమ భాషల్లోని విలక్షణత్వాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు గురువారం ఉత్సవాల నిర్వాహకులు రచయితకు వివరాలు అందించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా పరిశీలన

రాప్తాడురూరల్: ఓటరు జాబితా పరిశీలన పారదర్శకంగా జరుగుతోందని రాప్తాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీలో జరుగుతున్న 'ఓటరు జాబితా ప్రత్యేక సవరణ' కార్యక్రమాన్ని అనంతపురం రూరల్ మండలం అడిషనల్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు శ్రీధరమూర్తి, పుల్లయ్యతో కలిసి ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నరసింహారెడ్డి పరిశీలించారు. బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రతి ఇల్లూ తిరిగి జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్లు ఉన్నారా...వేరే ప్రాంతానికి మారారా?, ఎవరైనా చనిపోయారా?. కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునే వయస్సు ఉన్న వారు ఎవరైనా ఉన్నారా? తదితర వివరాలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

అనంతరం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన (బూత్ లెవల్ ఏజెంట్) బీఎల్‌ఏలతో సమావేశమై మాట్లాడారు. ఒక్కో పార్టీ తరఫున ఒక బీఎల్‌ఏ మాత్రమే సర్వేలో పాల్గొనాలని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు నమోదు చేసుకునే రిజిష్టర్‌లోని వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు ఇవ్వకూడదని ఆదేశించారు.

డీసీసీబీ ద్వారా విరివిగా రుణాలు

- బోర్డు మీటింగ్‌లో చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: అన్ని వర్గాల అభివృద్ధికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ద్వారా విరివిగా రుణాలు ఇస్తామని ఆ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. గురువారం స్థానిక డీసీసీబీ హాలులో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఆప్కాబ్, నాబార్డు సహకారంతో రైతులకు విరివిగా పంటరుణాలు ఇవ్వడంతో పాటు దీర్ఘకాలిక రుణాలు (ఎల్‌టీ), పాడి పశుపోషణ, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కూడా అర్హత కలిగిన వారికి రుణాలు ఇవ్వడానికి బ్రాంచ్ మేనేజర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇచ్చిన రుణాలు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా, రుణాలు తిరిగి బ్యాంకులకు చెల్లించేలా చూడాలన్నారు. రికవరీలు 5 శాతం లోపు తీసుకురావాలన్నారు. బంగారు నగల తాకట్టు రుణాలు, డిపాజిట్లు సేకరణపై దృష్టి పెట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలకు రుణభాగస్వామ్యం కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు బ్యాంకు టర్నోవర్ రూ.2 వేల కోట్ల మార్క్‌ను చేరుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పాతూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో కోటంక రైతు ఉత్పత్తి దారుల సంఘానికి మూలధనం కింద మంజూరైన రూ.10 లక్షల రుణానికి సంబంధించి చెక్కు అందించారు. అలాగే జూలై 18తో ముగిసిన పాలకవర్గాన్ని జనవరి 2024 వరకు మరో ఆరు నెలల పాటు పొడిగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బోర్డు మీటింగ్‌లో ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సీఈవో ఏబీ రామ్‌ప్రసాద్, డైరెక్టర్లు జనార్ధన్‌రెడ్డి, శంకరరెడ్డి, హైదర్‌వలీ, కారుణ్య, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రమణమూర్తి, అబ్దుల్‌రషీద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్ పాల్గొన్నారు.



బోర్డు మీటింగ్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

అనంతపురం రూరల్: సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్వీ నాయుడు మాట్లారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు వేణ, నూర్‌బాషా,నాగరాజు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. రాష్ట్ర నాయకురాలు రమాదేవి, నాయకులు కార్యదర్శులు జయమ్మ, శివశంకర్ పాల్గొన్నారు.

అనంతపురం క్రైం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు నాగభూషణ, వెంకటనారాయణ, ముర్తుజా, నాగరాజు, తిరుమలేష్ పాల్గొన్నారు.

కార్మికుల నిరసన

రాప్తాడు: గ్రామ పంచాయతీ కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు పోతులయ్య, క్రిష్టయ్య, రామచంద్ర, కాశీం ప్రసాద్, ఆదెప్ప పాల్గొన్నారు.